హైదరాబాద్ వార్త

# మోత మోగింది!

-ధాం..ధాం
-దీపావళికి అధికంగా పేలిన టపాసులు
-గతేడాదితో పోలిస్తే పెరిగిన కాలుష్యం
-అన్ని ప్రాంతాల్లోనూ పరిమితికి మించిన 'ధ్వని



**హైదరాబాద్, నవంబరు 1 ప్రభాతవార్త**

నగరంలో ఈసారి దీపావళికి టపాసుల మోత మోగింది. గతేడాది దీపావళి రోజు కంటే ఈసారి కాలుష్యం అధికంగా నమోదైంది. రెసిడెన్షియల్, ఇండస్ట్రియల్, కమర్షియల్..ఇలా అన్ని ప్రాంతాల్లోనూ పరిమితికి మంచి ధ్వని కాలుష్యం నమోదు కాగా, గాలిలో కాలుష్య ఉద్గారాల పరిమితి పెరిగింది. ఈమేరకు కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) అధికార వర్గాలు దీపావళికి సంబంధించిన ప్రాథమిక సమాచారం వెల్లడించారు. నివాస ప్రాంతాల్లో గతేడాది ధ్వని కాలుష్యం సరాసరి ( ఉదయం 6-రాత్రి 10) 64 డెసిబెల్స్ నమోదైతే..ఈసారి అది 69 డెసిబెల్స్‌కు పెరిగింది. నిబంధనల మేరకు రెసిడెన్షియల్ ప్రాంతాల్లో 55 డెసిబెల్స్‌కు మించరాదు. వాణిజ్య ప్రాంతాల్లో గతేడాది 71 డెసిబెల్స్ నమోదైతే..ఈసారి 72 డెసిబెల్స్‌కు పెరిగింది. వాస్తవానికి ఈ ప్రాంతాల్లో 65 డెసిబెల్స్‌కు మించరాదు. ఇక పారిశ్రామిక ప్రాంతాల్లో రాత్రి 10 గంటల తర్వాత టపాసుల మోతమోగిందని పిసిబి వర్గాలు పేర్కొంటున్నాయి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 64 డెసిబెల్స్ ఉంటే..ఆ తర్వాత రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు 71 డెసిబెల్స్‌కు పెరిగింది.

శ్వాసకోశ సంబంధ వ్యాధులకు కారణమయ్యే పిఎం 10 ఉద్ఘార స్థాయి ఊహించిన రీతిలో పెరిగినట్లు పిసిబి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ రోజుల్లో సగటున 85 ఉంటే దీపావళి రోజున 163 మైక్రోగ్రాము/క్యూబిక్ మీటర్‌గా నమోదైంది. అంటే సాధారణ రోజుల్లో కంటే దాదాపు రెట్టింపు స్థాయిలో నమోదైంది. వాస్తవానికి గాలిలో పిఎం 10 ఉద్గార స్థాయి 24 గంటల పాటు సగటున 100 మైక్రోగ్రాములు /క్యూబిక్ మీటరు మించరాదు. కళ్లు, ముక్కు మండేలా చేసే ఆక్సైడ్స్ ఆఫ్ నైట్రోజన్ (ఎన్ఓఎక్స్) 65 మైక్రోగ్రాముకు నమోదైంది. ఇక శ్వాసకోశ, బ్రాంకైటీస్, చికాకును కలిగించే సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్ఓ2) ఈసారి 6.0 నమోదైంది. సనత్‌నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, కొంపల్లి, అబిడ్స్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో అధిక వాయు కాలుష్యం ఉంది. గత గంటల సమయంలో పీఎం 2.5 కాలుష్యాలు 60 పాయింట్లలోపు ఉండాల్సి ఉండగా, సోమాజిగూడలో 105, హెచ్‌సీయూ, న్యూమలక్‌పేటలలో 99, యూఎస్ కాన్సులేట్ వద్ద 92, జూపార్కు వద్ద 91, కేపిహెచ్‌బి ఫేజ్2 వద్ద 84, కోకాపేట వద్ద 81 పాయింట్లుగా నమోదు అయినయంది. దీపావళి టపాసులతో వాయు నాణ్యతతో క్షీణత ఏ మేరకు జరిగిందో దీనిని బట్టి అర్థం చేసు కోవచ్చు. పొల్యూషన్ వల్ల దీర్ఘకాలిక రోగులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. గుండె, శ్వాసకోశ, మూత్రపిండాలు, కాలేయం ఇతర దీర్ఘకాలిక జబ్బులు, సమస్యలున్న వారిపై వాయు కాలుష్యం తీవ్ర ప్రభావం చూపనుంది. ముక్కులు కారడం, తుమ్ములు, గొంతు పొడిబారడం, గొంతు నొప్పి వల్ల కేసులు పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తుంది. ఓవైపు కాలుష్యం పెరగ్గా..మరో వైపు టపాసుల విక్రయాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్యం తీవ్ర స్థాయిలో నమోదు కావ దానికి కారణం గాలిలో తేమ శాతం ఎక్కువా ఉండడమేనని తెలుస్తోంది. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు టపాసుల నుంచి వెలువడే కాలుష్య ఉద్గారాలు త్వరలో గాలిలో కలసిపోయే ఆసాకరం ఉండదు. దీంతో ఆయా ప్రాంతాల్లో చుట్టుముట్టడంతో కాలుష్యం ఎక్కువగా నమో దైందని పేర్కొంటున్నారు.







దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే తలసాని

## హైదరాబాద్ ఖ్యాతిని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : సిపి సివి ఆనంద్

-పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం..



**పంజగుట్ట, నవంబర్ 1 ,ప్రభాతవార్త:**

హైదరాబాద్ ఖ్యాతిని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర పోలీసు కమీషనర్ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని నగర పోలీసు కమీషనర్ కార్యాలయంలో నగరంలోని అన్ని జోన్‌ల నుండి వచ్చిన పీస్ కమిటీ సభ్యులతో ఇటీవల నగరంలో జరిగిన సున్నితమైన, మతపరమైన సమస్యలపై చర్చిండానికి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు హైదరాబాద్ నగరంలో శాంతిని నెలకొల్పడానికి కీలకమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. ఇక ముందు కూడా మీమీ ఏరియాలలో పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులుగా కొనసాగుతూ శాంతిని నెలకొల్పడానికి మీ సేవలు ఎంతైనా అవసరమన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించడానికి స్థానిక పోలీసులకు సహకంరించాలన్నారు. పీస్ వెల్ఫేర్ కమిటీలో యువతకు కూడా ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ మధ్య నగరంలో కొంతమంది వ్యక్తుల చెడు చేష్టల వల్ల కలిగిన దుష్పరిణామాలపై పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఖండించారు. ఈ సందర్భగా సభ్యులు మాట్లాడుతూ పోలీసుల మధ్య సత్సంబంధాలు మెరుగు పరుచుకోవాలని, ఏదైనా శాంతి భద్రతల సమస్య వచ్చినపుడు పరస్పరం సహకరించుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయవచ్చున్నారు. వివిధ మత సమూహాల మధ్య అవగాహన, సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిండంతో పాటు విద్యా సంస్థలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సమాజంలో ఉద్రిక్తతలను పెంచే తప్పుడు సమాచారం, పుకార్ల వలన జరిగేప్రభావాలపై అవగాహన పెంచేవిధంగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ హైదరాబాద్ సిటీ పోలీసులకు మద్దతుగా ఉంటూ రాబోయే పండుగలను శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా, సమాజంలో సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నిర్మూలించడానికి ప్రజల్లో సామరస్య భావము, ఐక్యత నెలకొల్పే విధంగా కమ్యూనిటీ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని కమిటీ ప్రతిజ్ఞ చేసింది.

కార్యక్రమంలో నగరంలోని అన్ని జోన్‌ల ఉన్నతాధికారులతో పాటు పీస్ కమిటీ ప్రతినిధులు ఎద్దఎత్తున పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా చేపట్టాలి

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న దానకిశోర్ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 1,ప్రభాతవార్త:**

నూరుశాతం ఖచ్చితత్వంతో సామాజిక, ఆర్థిక ,విద్యా, ఉపాధి ,రాజకీయ కుల సర్వే సమగ్రంగా చేపట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ సూచించారు. ఈమేరకు ఖైరతాబాద్‌జోన్‌లో చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేపై శుక్రవారం సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు బంజారాహిల్స్‌లోని గౌరీశంకర్ కమ్యూనిటీహాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి దానకిశోర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నవంబర్ 6న ప్రారంభమయ్యే సర్వేలో వివిధ వర్గాల ప్రజల, సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని అన్నారు. గ్రేటర్ పరిధిలోని సర్వేను చేపట్టేందుకు 21వేలమంది ఎన్యూమరేటర్లను వినియోగించుకుంటున్నామన్నారు. ఆర్పీలను కూడా సర్వేలో భాగం చేశామని సర్వేను పకడబ్బందీగా చేపట్టేందుకు ప్రతి 10మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించాలని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్‌లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. సమగ్ర సర్వేద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేదవారికి చేరేందుకు దోహదపడుతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.శివకుమార్ నాయుడు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమిషనర్ స్నేహా శబరీష్, చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో సదర్ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు..

**పంజగుట్ట, నవంబర్ 1 (ప్రభాతవార్త):** నగరంలో సదర్ ఉత్సవాల సందర్భంగా పలు ప్రాంతాలలో ట్రాఫిక్‌ను మళ్ళించడం జరుగుతుందని, నగర పౌరులు ఈ విషయంలో సహకరించాలని నగర ట్రాఫిక్ అడిషనల్ కమీషనర్ పి.విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. నారాయణగూడలోని వైఎంసీఏ వద్ద ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్స్ ఈ విధంగా ఉన్నాయని, 2 వేదీ రాత్రి 7 గంటల నుంచి 3 వ తేదీ తెల్లవారు జాము వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని ఆయన ప్రకటించారు. రాంకోటి నుంచి వైఎంసీఏ, నారాయణగూడవైపు వచ్చే ట్రాఫిక్‌ను కాచిగూడ ఎక్స్ రోడ్డు వద్ద టూరిస్ట్ జంక్షన్ వైపు మళ్ళిస్తారు. లింగంపల్లి ఎక్స్‌రోడ్డు నుంచివైఎంసీఎ నారాయణగూడ వైపు వచ్చే ట్రాఫిక్‌నుకాచిగూడ ఎక్స్‌రోడ్డు వద్ద టాటా ఎక్స్‌రోడ్డు వైపు మళ్ళిస్తారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌నుండి వైఎంసీఏ వైపు వచ్చే ట్రాఫిక్‌ను విట్టల్‌వాడి ఎక్స్‌రోడ్డువద్ద రాంకోటి ఎక్స్‌రోడ్డు వైపు మళ్ళిస్తారు. విట్టల్‌వాడి ఎక్స్‌రోడ్డునుంచి రాజ్‌మొహల్లా చిల్లా వైపువచ్చే ట్రాఫిక్‌ను పద్మశాలిభవన్ వద్ద రాంకోటి ఎక్స్‌రోడ్డువైపు మళ్ళిస్తారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ క్రౌన్ కేఫ్‌నుండి వైఎంసీఎ వైపు వచ్చే ట్రాఫిక్ నారాయణగూడ ఎక్స్‌రోడ్డు వద్ద హిమాయత్‌నగర్ వై జంక్షన్ వైపు మళ్ళించబడుతుంది. బాగ్‌లింగంపల్లి కాలనీలోని లేన్‌లు, బైలేన్‌ల నుండి వైఎంసీఎ వైపు వచ్చే ట్రాఫిక్ రెడ్డి కాలేజి జంక్షన్ వద్ద బాబా టెంట్‌హౌస్ వైపు మళ్ళించబడుతుంది. బర్కత్‌పురా చమన్‌నుండి వైఎంసీఎ వైపు వచ్చే ట్రాఫిక్‌పోస్టాఫీస్ వద్ద మళ్ళించబడుతుంది. లింగంపల్లి ఎక్స్‌రోడ్డు, కాలనీ వైపు వచ్చే ట్రాఫిక్‌మఠం వద్ద పోస్టాఫీస్ వైపు మళ్ళించబడుతుంది. కాచిగూడ ఎక్స్‌రోడ్డు, టూరిస్ట్ జంక్షన్ నుండిపోస్టాఫీస్ వైపు వచ్చే ట్రాఫిక్ లింగంపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద టూరిస్ట్ జంక్షన్, కాచిగూడ ఎక్స్‌రోడ్డు వైపు మళ్ళించబడుతుంది. సదర్ మేళాకోసం వచ్చే సందర్శకులు తమ వాహనాలను కేశవ్ మెమోరియల్ కళాశాల మైదానంలో పార్క్ చేయాలని అధికారులు సూచించారు.

## నగరంలో "అగ్ని ప్రమాదాల కలకలం "



సికింద్రాబాద్ రమేష్ ఎలక్ట్రికల్స్ లో అగ్ని ప్రమాదం.

**హైదరాబాద్, నవంబరు 1,ప్రభాతవార్త:**

హైదరాబాద్‌లో పలుచోట్ల అగ్ని ప్రమాద ఘటనలు కలకలం రేపాయి. నగరంలోని పలు చోట్ల ఒక్కసారిగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫైర్ సిబ్బందితో అగ్ని ప్రమాద ఘటన వద్దకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా క్షణాల్లో హాజరై మంటలను అదపులోకి తీసుకువచ్చారు. అయితే నగరంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 18లో అగ్ని ప్రమాదం జరిగింది. ఓఅపార్ట్‌మెంట్‌లోని నాల్గొవ అంతస్తులోని ఫ్లాట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వ్యాపించడంతో అపార్ట్‌మెంట్‌లో ఉన్నవారు ఫైర్‌సిబ్బంది సమాచారం ఇచ్చారు. దీంతో అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడానికి గల కారణం ..ఫ్లాట్ ఓనర్ ఉదయం ఫ్లాట్‌లో పూజ చేసి బయటకు వెళ్లాడు. వెళ్లే సమయంలో బాల్కానీ డోర్ తెరిచి వెళ్లాడు. దీంతో ఫ్లాట్‌లో మంటలు వ్యాపించాయని పోలీసులు తెలిపారు.

**మాదాపూర్‌లో షాట్ సర్క్యూట్...**

మాదాపూర్‌పోలీస్ స్టేషన్ పరిదిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీసాయి సరిత డెంటల్ క్లినిక్‌ముందు ఉన్న ట్రాన్స్‌ఫారం దగ్గర షాట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్‌తో వైర్లు తెగడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షాపులు మూసి ఉండటం ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది మంటలను అదపు చేశారు.

**ఫర్నీచర్ షాప్‌లో అగ్ని ప్రమాదం..**

నగరంలోని సరూర్‌నగర్ భగత్‌సింగ్ నగర్ ఈస్ట్ వుడ్ ఫర్నిచర్‌షాప్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదంలో ఫర్నిచర్ షాప్ సోఫా తయారీ యూనిట్ పూర్తి స్థాయిలో దగ్ధమయ్యాయి. ఐదు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. ప్రమాదంకు గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. అతికష్టం మీద పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

**సికింద్రాబాద్ ఎలక్ట్రికల్ గోదాంలో అగ్ని ప్రమాదం....స్వల్ప ఆస్తినష్టం.**

క్రాకర్స్ రోడ్లపైన ఎక్కడ బడితే అక్కడ కాల్చుతుండటంతో కాలుతున్న టపాకాయలు సమీపంలోని దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో పడి అవి అగ్నికి ఆహుతవుతున్నాయి. సరిగ్గా ఇలాంటి ఘటనే దీపావళి పండుగ రోజు మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిన క్రాకర్స్ ప్రమాద వశాత్తు ఆర్పీరోడ్డు లో రెండవ అంతస్తులో ఉన్న రమేష్ ఎలక్ట్రికల్స్ షాపు గోదాములో పడటంతో అక్కడ నిల్వ చేసిన ఎలక్ట్రికల్ వైర్లతో పాటు వారు అక్కడ నిల్వ పెట్టుకున్న ఖాళీ అట్టపెట్టెలు మంటలకు కాలిపోయాయి. మంటలు భారీగా రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళణలకు గురయ్యారు. విషయాన్ని గమనించిన వారు వెంటనే సమాచారాన్ని డయల్ 100కు కాల్ చేసి తెలియజేయడంతో వెంటనే మహంకాళీ ఏసీపీ పరుశురాం సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు రెండు అగ్నిమాపక శకటాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. స్వల్ప ఆస్తి నష్టం మినహా ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అధికారులతో పాటు అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## నగరంలో భారీ వర్షం..

-రహదారులు జలమయం



**హైదరాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త:**

నగరంలోని పలుప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొండాపూర్, మియాపూర్, లింగంపల్లి , కెపిహెచ్‌బి ,మూసాపేట్ ,నిజాంపేట్, మాదాపూర్ ,మేడ్చల్, కండ్లకోయ , కృష్ణాపూర్ , దుండిగల్ ,గండి మైసమ్మ ,మల్లంపేట్ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్‌పాస్ కింద వరదనీరు భారీగా చేరడంతో ట్రాఫిక్ పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వస్తున్న వాహనాలను నల్లగండ్ల ఫ్లైఓవర్‌వైపు మళ్ళించారు. రహదారులపై వర్షపునీరు ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## నార్సింగిలో కన్నుల పండువగా "సదర్" ఉత్సవాలు



నార్సింగిలో సదర్ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్ తదితరులు.

**నార్సింగి, నవంబర్ 1 ప్రభాతవార్త :** గండిపేట్ మండలంలోని నార్సింగిలో యాదవులు నిర్వహించిన "సదర్" ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. భారీ దున్నపోతులను తీసుకు వచ్చిన యాదవులు వాటిని అందంగా అలంకరించి వాటితో డప్పుల దర్వుకు అనుగుణంగా ఆడుతూ, పాడుతూ నృత్యాలు చేయించారు. దున్నపోతు రెండు కాళ్లను ఎదపై పెట్టుకొని యాదవ సోదరులు చేసిన పలు సాహసోపేతమైన నృత్యాలు ఆహుతులను అబ్బురపరిచాయి. వ్యవసాయం, పశు సంపద అంతరించిపోతున్న తరుణంలో సైతం దున్నపోతులను అందంగా అలంకరించి, పుర వీధులలో భారీ ఊరేగింపుతో నిర్వహించిన సదర్ ఉత్సవాలు చిన్నా, పెద్దలందరిని అలరించాయి. యాదవ సోదరులు తమ దున్నపోతులను అందంగా తయారు చేయడంతో పాటు వినూత్న రీతిలో వాటితో నృత్యాలు చేయించి శభాష్ అనిపించుకున్నారు. నార్సింగితో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వందలాదిగా తరలి వచ్చి సదర్ ఉతస్సవాలను తిలకించారు. నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదర్ వేడుకలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొని యువతతో కలిసి ఆడిపాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండగలు మన సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందించేందుకు ఉపకరిస్తాయన్నారు. పెద్దలంతా మన ధర్మంను ఆచరిస్తూ, బిడ్డలతో కూడా ఆచరింపచేయాలన్నారు. ఈ వేడుకల్లో రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి మల్లేష్ ముదిరాజ్, మణికొండ మున్సిలప్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి పుర ప్రముఖులు, యాదవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మరోవైపు గండిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ వేడుకలు నిర్వహించారు. ఈ వాడుకలలో రాము, వినోద్, వేణుగౌడ్, జెల్లి వెంకటేష్ తదితరులు కాంగ్రెస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణరెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## కెబిఆర్ పార్క్ వద్ద ఫల్టీలు కొట్టిన కారు..



**పంజగుట్ట, నవంబర్ 1 (ప్రభాతవార్త):**

బంజారాహిల్స్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి కేబీఆర్ పార్క్‌లోకి దూసుకెళ్ళింది. క్యాన్సర్ ఆసుపత్రి నుంచి కేబీఆర్ పార్క్ వైపు వెళుతున్న పోర్షే కారు అతివేగంతో మూలమలుపు వద్ద గోడను ఢీకొట్టింది. ఒక్కసారిగా కారు వేగంతో ఫల్టీలు కొట్టడంతో కేబీఆర్ పార్క్ గ్రిల్స్ ధ్వంసమయ్యాయి. చివరకు ఆ వేగానికి కారు చెట్టుకు ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదం జగిన వెంటనే కారులోని వారు కారు నంబర్ ప్లేట్ తీసి పరారయ్యారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అతివేగం కారణంగానే ప్రమాదం సంభవించిందని ప్రాథమికంగా ఓ నిర్ణయానికి వచ్చారు. కారు ఛాయిస్ నంబర్ ఆధారంగా ప్రమాదానికి కారుకులెవరో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కారు బెలూన్‌లు ఓపెన్ అవడంతో కారులో ఉన్నవారికి ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని పోలీసులు తెలిపారు. బంజారాహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### మోమోస్ కేసులో ఆరుగురు నిందితుల అరెస్ట్

**పంజగుట్ట, నవంబర్ 1 (ప్రభాతవార్త):**

మోమోస్ కేసులోల బంజారాహిల్స్ పోలీసు లు ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఇటీవల మోమోస్ తిని ఒకరు మృతి చెందగా, పలువురు అనారోగ్యం పాలైన విషయం విదితమే. చింతల్‌బస్తీలో మోమోస్ తయారు చేస్తున్న అల్మాస్‌తో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మోమోస్ తయారీలో నాశిరకం పదార్థాలు వాడినట్లుగా అధికారులు గుర్తించారు. నాశిరకం, అపరిశుభ్రత కారణంగా మోమోస్ విష పదార్ధంగా మారాయని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లో వారాంతపు సంతలో అమ్మిన మోమోస్‌ని రేష్మ అనే మహిళ కొనుగోలు చేసి తిన్నది. ఆ తర్వాత ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యులు రేష్మ మృతికి కల్తీ మోమోస్ కారణమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే మోమోస్ తయారీ కేంద్రాన్ని ఫుడ్‌సేఫ్టీ అధికారులు పూర్తిగా తనిఖీలు నిర్వహించి ఇక్కడ అపరిశుభ్రత వల్లే ఇబ్బందులు తలెత్తాయని నివేదిక ఇవ్వడం జరిగింది. నాశిరకం, అపరిశుభ్రంగా తయారు చేసిన మోమోస్, మయానైన్ శాంపిల్స్‌నుసేకరించి ల్యాబ్‌కు తరలించారు. తాజాగా ఈ కేసులో ఆరుగురురిని అరెస్ట్ చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో మయోనైజ్‌ను ప్రభుత్వంఏడాదిపాటు నిషేధించిన విషయం తెలిసిందే.

### రోడ్డు ప్రమాదంలో భర్త మృతి..భార్యకు తీవ్ర గాయాలు

**కంటోన్మెంట్, నవంబర్ 1 ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో కట్టుకున్న భర్త మృతి చెందగా భార్య తీవ్ర గాయాల పాలైంది. ఈ సంఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం యాప్రాల్ బాపూజినగర్‌కు చెందిన తోట ముత్యాలమ్మ ప్రధాన రోడ్డు మార్గంలో కూరగాయలు తీసుకొని యాప్రాల్ వైపు వెళ్లేందుకు తోట ముత్యాలమ్మ ప్రధాన మార్గంలో ద్విక్రవాహనంపై యూటర్న్ చేస్తుండగా రీసాలబజార్ బొల్లారం చెక్‌పోస్టు నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న ఇసుకలారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో దయానంద్ అక్కడికక్కడే మృతిచెందగా అతని భార్య లావణ్య తీవ్ర గాయాలపాలైంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్ గణేష్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడు సంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఖైరతాబాద్‌లో జరిగిన సదర్ సమ్మేళనంలో దున్నపోతుల విన్యాసాలు

## మానసిక ప్రశాంతతకు ఆదియోగి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం : ఎమ్మెల్యే శ్రీగణేష్



మారేడ్‌పల్లి హిందూ స్మశాన వాటికలో ఆదియోగి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 1 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు మృతి చెందిన వారి జ్ఞాపకాలను దృష్టిలో ఉంచుకొని ఆదియోగి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి మారేడ్‌పల్లి హిందూ స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన ఆదియోగి విగ్రహాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కేర్‌టేకర్ సదానంద్, వెంకట్ స్వామి, హంససరాజ్, ముత్యాలు, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయి : జంపన



1వ వార్డు బాపూజీ నగర్ నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 1 ప్రభాతవార్త:** అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణరెడ్డిలు తెలిపారు. హుమాన్ పౌండేషన్ వ్యవస్థాపకుల ప్రకాష్ బాంటియా, వి.ఆర్.ఆర్.ఆసుపత్రి ఎండి నంది కిషోర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. దీపావళి, అమావాస్యను పురస్కరించుకొని గురువారం బోయిన్‌పల్లి బాపూజీ నగర్ శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, అజిత్ కళ్యాణ్, ప్రేమ్ ముదిరాజ్, జహంగీర్, నరిసింహ్మా, రామారావ్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం హస్తకళ వృత్తికళాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తుంది : దేవకి



సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకురాలు దేవకి దేవి

**కంటోన్మెంట్,నవంబర్ 1 ప్రభాతవార్త:** హస్తకళ వృత్తుల కళాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తుందని అభ్యుదయ గ్రామీణ ద్వాక్రా రాష్ట్ర అధ్యక్షురాలు దేవి దేవకి తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవకి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన ద్వాక్రా మహిళలు, హస్త కళాకారులు రూపొందించిన ఉత్పత్తులు 300 సెంటర్లలో సందర్శకులకు అదుబాటులో ఉంచామన్నారు. ఈ వస్తువుల తయారీలో ఎంతో నాణ్యత ఉంటుందన్నారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## డబ్బుతో పరాచికాలు ఆడితే కోలుకోలేని దెబ్బకొడుతుంది

### -లక్ష్మీ కటాక్షం పుస్తకంపై చర్చ..



లక్ష్మీ కటాక్షం పుస్తకం ఆవిష్కరణ

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 1, ప్రభాతవార్త**

డబ్బును గౌరవించాలి, డబ్బుతో పరాచికాలు ఆడితే మహామహులను సైతం కోలుకోని విధంగా డబ్బు దెబ్బ కొడుతుందని లక్ష్మీ కటాక్షం - పుస్తక రచయిత, ఆర్‌టిఐ మాజీ కమీషనర్ బుద్ధా మురళి అభిప్రాయం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లిలోని కెయస్‌పి ట్రేడింగ్‌పై కోచింగ్ ఇన్స్టిట్యూట్‌లో లక్ష్మీ కటాక్షం పుస్తకంపై బుధవారం చర్చ నిర్వహించారు. ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు కె.సుబ్రమణ్య ప్రసాద్ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పుస్తక రచన ఉద్దేశాన్ని రచయిత మురళి వివరించారు. కాంతారావు, సావిత్రి, చిత్తూరు నాగయ్య, కస్తూరి శివరావు, రాజబాబు, రాజనాల, గిరిజ వంటి హేమా హేమీలైన నటులు ఒకప్పుడు రాజభోగం అనుభవించి ముందు జాగ్రత్త లేకపోవడం వల్ల చివరి దశలో దుర్భర జీవితం గడిపారు అని ఒక్క సినిమా నటులే కాదు ప్రకాశం పంతులు వంటి రాజకీయ నాయకులు, చివరకు మొఘల్ చక్రవర్తి వారసులు సైతం డబ్బు విషయంలో చూపిన నిర్లక్ష్యం వల్ల దుర్భర జీవితం గడిపారని అలాంటి పరిస్థితి రాకుండా డబ్బు విషయంలో ఆలోచన రేకెత్తించే విధంగా ఉందని, మనీ మేనేజ్‌మెంట్ గురించి ఎన్నో విషయాలు మంచి ప్రభావం చూపే విధంగా పుస్తకం ఉందని కెయస్‌పి ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు సుబ్రమణ్య ప్రసాద్ తెలిపారు. పలువురు పుస్తకంపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

## ఇరువర్గాలపై కేసు నమోదు

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** యూసుఫ్‌గూడ చౌరస్తా సమీపంలో ఓ స్థలం విషయమై ఇరువర్గాల వారు గొడవకు దిగడంతో వారిపై కేసు నమోదు అయింది. యూసుఫ్‌గూడ బస్తీ చౌరస్తాలో ఉన్న స్థలంలో ఓ వర్గం వారు ప్రహరిని నిర్మిస్తుంటే మరో వర్గం వారు అడ్డుకున్నారు. అక్కడ ఉద్రిక్తత వాతావరణం ఏర్పడటంతో మధురానగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు చెందిన పల్లె ప్రభాకర్, పల్లె మంజుల, బాల మురళీ కృష్ణ, బాలరాజుతో పాటు గొడవకు దిగిన మరో వర్గానికి చెందిన పల్లె భరత్‌రాజు పల్లె పవన్‌కుమార్, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సయ్యద్ బండ్లగూడ హాఫీజ్ బాబానగర్‌కు చెందిన మహ్మద్ రహ్మత్ జిలానీలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భక్తి,శ్రద్ధలతో దీపావళి వేడుకలు జరుపుకున్న ప్రజలు

**నార్సింగి, నవంబర్ 1 ప్రభాతవార్త :**

గండిపేట్ మండల పరిధిలోని ప్రజలు "దీపావళి" వేడుకలను భక్తి,శ్రద్ధల మధ్య జరుపుకున్నారు. మండల పరిధిలోని వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, కోకాపేట్, నార్సింగి, మణికొండ, పుప్పాలగూడ, నెక్‌నాంపూర్, మంచిరేవుల, గంధంగూడ, హైదర్షాకోట్, పీరంచెరువు, బండ్లగూడ కిస్మత్‌పూర్, హిమాయత్ సాగర్ గ్రామాలల్లో ఉన్న ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దీపావళిని పురస్కరించుకొని చాలా మంది భక్తులు ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, అన్నదానాలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. గురువారం సాయంత్రం లక్ష్మీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపావళి వేడుకలను కన్నుల పండువగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దీపావళి పర్వదినంను ఎందుకు జరుపుకుంటారో వివరించే పాటలు, నాటికలు వేసి వివరించారు. ఒక దీపంతో మరో దీపంను వెలిగించి మన జీవితంలోని అంధకారమంతా ఈ రోజుతో తొలిగి పోవాలని భక్తులందరూ లక్ష్మీ మాతను కోరుకున్నారు. పలు ఆలయాల్లో పుర ప్రముఖులు మాట్లాడుతూ హిందువులు జరుపుకునే ప్రతీ పర్వదినం వెనుకాల ఓ ఆరోగ్య రహస్యం దాగి ఉంటుందన్నారు. హిందూ అంటే మతం కాదని, మానవాళి అనుసరించదగ్గ జీవన విధానమని స్పష్టం చేశారు. పర్వదినాలు మన సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందించేందుకు వారధులుగా ఉపకరిస్తాయన్నారు. ఎవరి మతంను వారు ఆచరిస్తూనే ఇతరుల మతాలను గౌరవించినప్పుడే సోదర, సౌభాతృత్వాలు వెల్లివిరుస్తాయని వివరించారు. బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు, మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. లక్ష్మీమాత పూజల అనంతరం చిన్న,పెద్ద,ఆడ,మగ అందరూ కలిసి ఇళ్లంతా దీపాలు వెలిగించి, బాణాసంచాను పేల్చి సంబరాలు జరుపుకున్నారు.



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న మణికొండ మున్సిపల్ ప్రజలు.

## భాగ్యలక్ష్మిమందిరంలో మాజీ కార్పొరేటర్ పూజలు



భాగ్యలక్ష్మిమందిరంలో పూజలు చేసిన మాజీకార్పొరేటర్ దంపతులు పి.మమతసంతోష్‌గుప్త

**బేగంబజార్,నవంబర్ 1ప్రభాతవార్త:**

దీపావళి పండుగ పురస్కరించుకుని చారిత్రాత్మకమైన చార్మినార్ భాగ్యలక్ష్మిమందిరంలో మాజీ కార్పొరేటర్ పి.మమత సంతోష్‌గుప్త అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు పి.మమతసంతోష్‌గుప్తను శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసమాజ్ తొలి ప్లీనరికి శ్రీనివాస్‌గుప్తకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందచేస్తున్న దృశ్యం

**గోషామహల్,నవంబర్ 1ప్రభాతవార్త:** ధర్మ సమాజ్ మొదటి ప్లీనరి మహా సమ్మేళన సభకు ఆపార్టీ నేతలు,ప్రజా ఏక్తా పార్టీజాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్‌గుప్తను ఆహ్వానించారు. ధర్మసమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ జెపల్లిసైదులు మహారాజ్, హైదరాబాద్ జిల్లా కో కన్వీనర్ హర్షవర్ధన్ మహారాజులు,ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకఅధ్యక్షులు విశారధన్ మహారాజ్ ఆదేశాల మేరకు గౌలిగూడలోని ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్‌గుప్తను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానపత్రికను అందచేశారు. ఈనెల 3వతేదిన అధిభట్లలోని ఒఆర్‌ఆర్ రోడ్డులోని కెబిఆర్ గార్డెన్‌లో ధర్మసమాజ్ పార్టీ తొలి ప్లీనరీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీలతోపాటు అగ్రకులాల నిరుపేదలకు న్యాయం జరిగేందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా పోరాటం చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ వయస్సుకే ..సేవా భావానికి కాదు

### -ఆర్టీసి ఈడిఓ మునిశేఖర్



గోవర్ధనచారిని సన్మానిస్తున్న మునిశేఖర్, సిఏవో గీతా, ఏవో రంగారావు ఇతర సిబ్బంది

**హైదరాబాద్,నవంబర్ 1,ప్రభాతవార్త:**

ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి తప్పదని, అదికేవలం వయస్సుకే తప్పా ..సేవా భావానికి కాదని ఆర్టీసి ఈడిఓ మునిశేఖర్ అన్నారు. ఆర్టీసి ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ (ఫైనాన్స్)గా పదవి విరమణ చేసిన తొగిటి గోవర్ధనచారిని ఆర్టీసి ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కార్యాలయంలో అధికారులు ,ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవర్ధనచారిని సన్మానించారు. అనంతరం ఈడివో మునిశేఖర్ మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో మంచిగుర్తింపు ఉంటుందని అన్నారు. ఆర్టీసిలో సేవలు అందించి ఉద్యోగుల మన్ననలు పొంది పదవివిరమణ చేయడం గొప్పవిషమని ,చారి చేసిన సేవలు ఆర్టీసి ఎప్పటికి మరిచిపోదన్నారు. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు అన్ని విధాలుగా సన్నిహితంగా ఉంటనే పూర్తి సమాచారం సేకరించవచ్చునని అన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ సిఏవో గీతా, ఏవో రంగారావు, విటోబా, సంధ్య, మగ్బుల్ పాషా, శోభన్‌బాబు, పద్మావతి, నర్సయ్య, శీనప్ప, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలోంచి గొలుసు చోరీ

**హయత్‌నగర్, నవంబరు 1 ప్రభాతవార్త:** దీపావళి పండుగ రోజున దీపాలు కొనుగోలు చేసి నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలోంచి గుర్తు తెలియని దుండుగుడు బంగారు గొలుసును లాక్కుని పరారైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... తొర్రూర్ గ్రామానికి చెందిన మేకం బాలమ్మ ఈనెల 31న సాయంత్రం 5 గంటలకు తన ఇంటి సమీపంలోని కిరాణా దుకాణంలో దీపం కుందులు కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా... బైక్‌పై వెనుకనుంచి వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని 4.2 తూలాల బంగారు గొలుసుకుని లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి తొర్రూర్‌కి వచ్చి బాధితులనుంచి వివరాలు సేకరించారు.

## అమావాస్య రోజున కార్మికులు పనులు బంద్ చేయాలి



కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేసిన అధ్యక్షులు మహ్మద్ హైమద్.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 31, ప్రభాతవార్త :**

అమావాస్య రోజున విధిగా కార్మికులు పనులు బంద్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహ్మద్ హైమద్ అన్నారు. శుక్రవారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని అబీబ్ ఫాతిమా నగర్ జోన్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. జోనల్ పరిధిలో కార్మికులు తప్పని సరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. తమ అసోసియేషన్ కోసం శాశ్వత కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వం తరపున డివిజన్ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డిని కోరారు. దీపావళిని పురస్కరించుకుని కార్మికులకు మిఠాయిలను అందజేశారు. ఈకార్యక్రమంలో ముజీబ్, ఫారుక్, టైసన్ శ్రీను, వెంకటేష్, బంగారి, రాజుగౌడ్, బాలయ్య, కోటి, పాల్గొన్నారు.

## పథకాలు పేదలకు అందేలా చూడాలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి రవిశేఖర్‌రెడ్డి.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 31, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకాన్ని అర్హులైన పేదలకు అందేలా చూసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పివి రవిశేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా ముఖ్యమంత్రిని కలిశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలని సూచించారు.

## పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



అన్న దాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 1 ప్రభాతవార్త :**

బాబుల్‌రెడ్డి నగర్ శ్రీ పోచమ్మ దేవాలయంలో శుక్రవారం పోచమ్మ దేవాలయం వార్షి కోత్సవం,దీపావళీ అమావాస్య పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మందిరం ఆవరణలో అన్న దాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శ్రీ పోచమ్మ దేవాలయం కమిటి ప్రతినిధులు వెంకటేష్,రమేష్ రెడ్డి,సంతూ గౌడ్,గోపాల్ నాయక్,శంకర్, కురుమయ్య రాజు,పాల్గొన్నారు.

## ప్రజల్లో ఐక్యతను పెంపొందించేవి పండుగలు

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



దీపావళి వేడుకలలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త:** ప్రజల్లో ఐక్యతను పెంపొందించేవి పండుగలేనని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా గురువారం రాత్రి ముషీరాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు శివముదిరాజ్, శ్రీధర్‌చారిల ఆధ్వర్యంలో దీపావళి పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహాతో కలసి హాజరై లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టపాసులు కాల్చి నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియచేశారు. దీపావళి వెలుగులు ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దీన్‌దయాళ్ రెడ్డి, సదా, ఎండీ మోహిన్, వీరేష్, శ్రీనివాస్, రాజు, హేమచక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వానికి మేలుకొలుపు కృష్ణశాస్త్రి రచనలు



కార్యక్రమంలో పాల్గొన్న కళావిఎస్.జనార్ధనమూర్తి, వంశీ రామరాజు

**చిక్కడపల్లి, నవంబరు 1 ప్రభాతవార్త:** మానవత్వానికి మేలుకొలుపు దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహిత్యం అని వక్తలు పేర్కొన్నారు. ఎందరోమహానుభావులు మధుస్మృతులు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన సుప్రసిద్ధ సాహితీవేత్త దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు మాట్లాడుతూ కవితాలోకాన కల్పవల్లి దేవులపల్లి కృష్ణశాస్త్రి అని అన్నారు. కృష్ణశాస్త్రి రాసేగీతాలు పాఠకులను తన్మయిత్వంలో మునిగితేలేలా చేస్తుందన్నారు. తెలుగు కవిత్వలోకాన కృష్ణశాస్త్రి ప్రముఖ అధ్యాయమని, తెలుగు సినిమా రంగాన ఆయన పాటలు జగద్విఖ్యాతం అని అన్నారు. మహాకవి శ్రీశ్రీ సైతం 'నేను కృష్ణశాస్త్రి కవితాశైలిని అనుకరించేవాడిని' అని పేర్కొనడం విశేషమని, ఆయనకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ఇవ్వడం తెలుగుకవికి తొలిసిరా దక్కిన గౌరవమన్నారు. గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి మాట్లాడుతూ భావ కవిత్వ సార్వభౌముడు కృష్ణశాస్త్రి అని, సులువైన పదాలతో గాఢమైన భావాన్ని చెప్పగల నేర్పుకలవారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు ఎస్‌బి.రామ్, గానసభ పాలకమండలి సభ్యురాలు శ్రీలతవర్మ, గానసభ సభ్యుడు శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హాషీష్ ఆయిల్ రవాణా చేస్తున్న ముఠా అరెస్టు..





విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్ కుమార్

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 1, ప్రభాతవార్త**

మత్తు కోసం వ్యసనాల బారిన పడుతున్న కొంతమందిని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు హాషీష్ ఆయిల్ సరఫరా చేసి కాసులు సంపాదించుకుంటున్నారు. అక్రమంగా హాషీష్ ఆయిల్ రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను శుక్రవారం సైబరాబాద్ ఎస్‌ఓటి, బాలానగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సురేష్ కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. నిందితులు సభావత్ సుమన్, రమావత్ లాలు, కేతావత్ విజయ్ కుమార్‌లు హాషీష్ ఆయిల్‌ను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డారు. సభావత్ సుమన్‌ను 2021లో డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే అతను విశాఖపట్నం జైల్లో ఉన్న సమయంలో ఒడిశాకు చెందిన మరో నిందితుడు కిరణ్‌తో పరిచయం ఏర్పడింది. వారు జైల నుండి విడుదలైన అనంతరం సులభంగా డబ్బు సంపాదించడానికి గంజాయి, హాషీష్ ఆయిల్‌ను రవాణా చేయాలని ప్రణాళిక రూపొందించారు. అదే సమయంలో తనకు తెలిసిన వారికి గతంలో ఎన్డీపీఎస్ కేసులో మూడు సార్లు జైల్‌కు వెళ్లిన కేతావత్ విజయ్ కుమార్‌ను కలిసి గంజాయి కొనుగోలుకు కస్టమర్లను వెతకమని కోరారు. అదేవిధంగా కిరణ్‌ను ఒడిస్సా రాష్ట్రం నుంచి హాషీష్ ఆయిల్‌ను ఏర్పాటు చేయమని చెప్పాడు. అక్టోబర్ 27వ తేదీన సభావత్ సుమన్, రమావత్ లాలు పల్సర్ బైక్‌పై నల్గొండ జిల్లా, దేవరకొండ, పోలేపల్లి గ్రామం నుండి పాడేరు వెళ్లి పోలీసుల తనిఖీలను, టోల్ గేట్లను నివారించేందుకు 1000 కిలోమీటర్లు ప్రయాణించారు. నిందితుడు కిరణ్ వారికి 2,590 లీటర్ల హాషీష్ ఆయిల్‌ను డెలివరీ చేశాడు. అనంతరం కేతవత్ విజయ్ కుమార్ సమక్షంలో అక్టోబర్ 31వ తేదీన సభావత్ సుమన్, రమావత్ లాలు బాలానగర్‌లోని సనత్‌నగర్ ప్రాంతంలో కస్టమర్ల కోసం వెతుకుతూ శోభన బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే బాలానగరన, ఎస్‌ఓటి సైబరాబాద్, బాలానగర్ పోలీసులతో కలిసి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 12,95,000 విలువ చేసే 2.590 లీటర్ల హాషీష్ ఆయిల్, పల్సర్ మోటార్ సైకిల్, 3 మొబైల్ ఫోన్లు, మొత్తం 13, 50,000 విలువ గల సొత్తును స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఎస్‌ఓటి డీసీపీ శోభన్ కుమార్, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సిఐ నరసింహారాజు, ఎస్‌ఓటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా జ్యోతి





జ్యోతికి నియామక పత్రం అందిస్తున్న అంబటి కృష్ణమూర్తి తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 1,ప్రభాతవార్త:**

వేతన వివక్ష, అధికపనిభారం అభద్రతా, సామాజిక సమానత్వం పొందక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న అసంఘటిత రంగంలోని మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం ఖైరతాబాద్‌లోని ఐఎన్‌టియుసి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ మహిళా కార్మిక నాయకురాలు నర్సేటి జ్యోతిని ఐఎన్‌టియుసి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రగతిశీలమైన భారత రాజ్యాంగం స్త్రీపురుషులకు సమాన హక్కులకు హామీ ఇస్తుందని, విద్య నైపుణ్యంతో మహిళలు పురుషులకంటే ముందుకు దూసుకుపోతున్న తరుణంలో దేశంలో ఇంకా ప్రతిచోట మహిళలకు రెండవ ప్రధాన్యత ఇవ్వబడుతుండటం దుర్మార్గమన్నారు. భారతదేశంలోని శ్రామికశక్తిలో దాదాపు 31శాతం మంది మహిళలు ఉన్నారని,అందులో 85శాతానికి పైగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని ,వీరికి తక్కువ వేతనం అందుతుందని చట్టాల ప్రకారం మహిళా కార్మికులకు అందే ప్రయోజనాలు కూడా అందలేదని ఆయన వాపోయారు. మహిళ కార్మికుల సమస్యల పరిష్కారానికి ,ఉపాధి అభివృద్ధి ఫలాల్లో సమానంగా భాగస్వామ్యం కోసం కార్మికుల సంక్షేమం ,భద్రతకోసం గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పోరాడి తెచ్చుకున్న 44కార్మిక చట్టాల పునరుద్దరణకోసం బలమైన ఉద్యమాలు నిర్మించాలని ఆయన కోరారు. నర్సేటి జ్యోతి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా మహిళా సమస్యలపై వారిహక్కులపై పోరాటాలు నిర్వహించానని తనపై నమ్మకంతో ఐఎన్‌టియుసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పజెప్పిన అంబటికృష్ణమూర్తికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు పులిపాటి సత్యదేవ్, జాతీయ కార్యదర్శి ఎస్. రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగి సహకార సంఘం అధ్యక్షుడిగా కృష్ణ

**నార్సింగి, నవంబర్ 1 ప్రభాతవార్త :** గండిపేట మండలంలోని నార్సింగి సహకర సంఘం ఎన్నికలను శుక్రవారం అధికారి సీతారామయ్య సమక్షంలో నిర్వహించారు. ఈ సహకార సంఘం పరిధిలో మొత్తం 9.మంది డైరెక్టర్లు ఉన్నారు. చైర్మన్ పదవి కోసం ఖానాపూర్‌కు చెందిన తోల్‌కట్ట కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలు పోటీ పడ్డారు. వైస్ చైర్మన్ పదవికి మంచిరేవులకు చెందిన అశోక్‌రెడ్డి, నెక్‌నాంపూర్‌కు చెందిన సత్యనారాయణలు పోటీ పడ్డారు. కృష్ణకు 5.మంది డైరెక్టర్లు ఓట్లు వేశారు. విష్ణువర్ధన్‌రెడ్డికి నలుగురు డైరెక్టర్లు ఓట్లు వేశారు. దీంతో ఒక ఓటు తేడాతో చైర్మన్‌గా తోల్‌కట్ట కృష్ణ విజయం సాధించారని అధికారి సీతారామయ్య స్పష్టం చేశారు. అలాగే వైస్ చైర్మన్‌గా పోటీ చేసిన అశోక్‌రెడ్డికి 5ఓట్లు, సత్యనారాయణకు 4.ఓట్లు పడ్డాయి. అశోక్‌రెడ్డి ఒక ఓటుతో విజయం సాధించారు. విజేతలుగా నిలిచిన కృష్ణ, అశోక్‌రెడ్డిలకు అధికారి నియామక పత్రలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నార్సింగి సహకార సంఘం నూతన చైర్మన్ తోల్‌కట్ట కృష్ణ మాట్లాడుతూ రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని పతకాలు అందేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు, రైతు బంధు, పిఎం కిసాన్ వంటి పతకాలు అందేలా చూస్తానని, పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేలా ప్రయత్నం చేస్తానని తోల్‌కట్ట కృష్ణ వివరించారు. చైర్మన్‌గా గెలుపొందిన కృష్ణకు రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు గండయ్య ముదిరాజ్, రామేశ్వరం నర్సిహ్మా, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, పుర ప్రముఖులు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**సైఫాబాద్, నవంబరు 1 ప్రభాతవార్త:** ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గురువారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎఐటియుసి పతాకాన్ని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో బాల్‌రాజ్ మాట్లాడుతూ 1920లో అక్టోబరు 31న ముంబాయి నగరంలో లాలాల జపతిరాయ్ అధ్యక్షతన ఎఐటియుసి ఆవిర్భవించి నేటికి 105 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదన్నారు. నాటి నుంచి ఎఐటియుసి కార్మిక వర్గ రాజ్య స్థాపన, కార్మికుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలను సాధించడం జరిగిందని, కార్మికుల హక్కుల కోసం ఆనేక చట్టాలు సాధించామన్నారు. నేడు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎం.నర్సింహ్మా, పి.ప్రేమ్‌పావని, బి.వెంకటేశం, కమతం యాదగిరి, వెంకటయ్య, బోద్దుపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన కారు...వ్యక్తి మృతి

**గచ్చిబౌలి, నవంబరు 1 ప్రభాతవార్త :** ఔటర్ రింగురోడ్డు మీద వేగంగా వెళ్తున్న కారు టైర్ ఒక్కసారిగా పేలడంతో అదుపు తప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు తీవ్రంగా గాయపడగా, అందులో ఓ వ్యక్తి మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని ఫలక్‌నూమాలో నివాసం ఉంటున్న విద్యార్థి మహ్మద్ అబ్దుల్ రహీమ్(23) తన స్నేహితులతో కలిసి గురువారం ఇన్నోవా కారులో ఔటర్ రింగురోడ్డు మీద ప్రయాణిస్తున్నాడు. ఇన్నోవా కారు(ఎపి28 డిఆర్4000)ను మహ్మద్ ఇబ్రహీం అనే వ్యక్తి నడుపుతున్నాడు. సాయంత్రం 6.30 ప్రాంతంలో కారు ఔటర్ రింగురోడ్డు మీద వట్టినాగులపల్లికి చేరుకున్న తరువాత కారు ఎడమ వైపు వెనుక టైరు ఒక్కసారిగా పేలిపోయింది. కారు వేగంగా ఉండడంతో టైరు పేలిన వెంటనే అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, అందులో ఉన్న ప్రయాణికులు సైతం గాయాల పాలయ్యారు. కారులో ఉన్న అబ్దుల్ రహీమ్ తీవ్రంగా గాయపడగా, స్థానికుల సమాచారంలో సంఘటనా స్థలికి చేరుకున్న 108 సిబ్బంది అబ్దుల్ రహీమ్‌ను నల్లగండ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. కారులో ఉన్న మిగిలిన క్షతగాత్రులు ఆసీం అహ్మద్ ఖాన్, సయ్యద్ మగ్దుం మహ్మద్, షేక్ సుఫీయాన్, సయ్యద్ సైఫ్, డ్రైవింగ్ చేస్తున్న మహ్మద్ ఇబ్రహీంలకు తీవ్ర గాయాలు కాగా వీరిని ఐటి కారిడార్‌లో ఉన్న ఆసుపత్రికి తరలించారు. కాగా కారు డ్రైవింగ్ చేస్తున్న మహ్మద్ ఇబ్రహీం నిర్లక్ష్యం కారణం గానే ప్రమాదం చోటుచేసుకుందని, అతనిమీద చర్యలు తీసుకో వాలని కోరుతూ అబ్దుల్ రహీమ్ కుటుంబ సభ్యులు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శ్మశానంలో వ్యక్తికి మంటలు..

### -బయటకు పరుగులు ..

**పంజగుట్ట, నవంబర్ 1,ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం ఒంటికి నిప్పంటించుకుని నానా హంగామా చేయడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వివరాలలోకెళితే బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోనుంచి గుర్తు తెలియని వ్యక్తికి శ్మశాన వాటికలో నిప్పంటుంది. దీంతో రక్షించమని కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశాడు. ఏం జరిగిందో అర్థంకాక స్థానికులు శ్మశానం నుండి శవం కాలుతూ బయటకు వస్తుందని భయకంపితులయ్యారు. వెంటనే అక్కడకు సమీపంలో ఉన్న జీహెచ్ఎంసీ సిబ్బంది వెంటనే తేరుకుని ఆ వ్యక్తికి అంటుకున్న మంటలను ఆర్పి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని ఆసుపత్రి తరలించారు. తీరా అసలు విషయమేమిటంటే..దీపావళి సందర్భంగా స్మశాన వాటికలో చనిపోయిన వారికోసం ఏర్పాటు చేసిన మందు, కల్లు తాగి అక్కడే పడిపోయాడు. బాధితుడిపైకి స్మశానంలో ఉన్న దీపం పడడంతో మంటలు ఒంటిపైకి పాకాయి. దీంతో రోడ్డుమీదకు పరుగులు తీశాడు. ఆ వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని పోలీసులు ధృవీకరించారు.

## విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

### -చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి



గ్రాడ్యుయేషన్ డే వేడుకలలో పాల్గొన్న చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి,తదితరులు

**మలక్‌పేట నవంబరు1,ప్రభాతవార్త :** విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ప్రగతి డిగ్రీ కాలేజీ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.దిల్‌షుక్ నగర్ ప్రగతి డిగ్రీ కాలేజ్ కో-ఎడ్యుకేషన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చే సిన కళాశాల చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...తమ కళాశాల విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు, ఉపా ధి అవకాశాలు కల్పిస్తున్నాయని వివరించారు.ఆధునిక యుగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షించా రు.విద్యార్థులు క్రమశిక్షణ,పట్టుదల అంకుటిత దీక్షతో తమ లక్ష్యాలను సాధించుకుని అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. అదే విధంగా విద్యార్థులకు పట్టాలను,సర్టిఫికెట్లను ఆయన అందుజే శారు.అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాం స్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్ర మంలో డైరెక్టర్లు డాక్టర్ పి.రామ్ రెడ్డి,ఎన్.సీతారాంరెడ్డి,ప్రిన్సిపల్ చిన్నారెడ్డి,అధ్యాపకులు జయచందర్,విజయ శ్రీ,సుకన్య, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల విద్యాభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటాం

### -విద్యాశాఖ కమిషనర్ నరసింహ రెడ్డి



కమిటీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న విద్యాశాఖ కమిషనర్ నరసింహా రెడ్డి

**మలక్ పేట నవంబరు1,ప్రభాతవార్త :** దివ్యాంగుల విద్యాభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ కమిష నర్ నరసింహా రెడ్డి పేర్కొన్నారు.మలక్‌పేట్ సూపర్ బజార్ లూయిస్ బ్రెయిలీ పార్క్‌లో యుసిడి కార్యాలయంలో ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ డిసేబుల్ ప్రతినిధులతో కమిషన్ సమావేశమ య్యారు.అంధులు,బధిరులు,శారీరక ,మానసిక,ఇతర అన్ని రకాల దివ్యాంగుల విద్యాభివృద్ధిపై వారితో ఆయన చర్చించారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016లో పేర్కొన్న విధంగా తెలం గాణలో ఆయా ప్రాంతాలలో దివ్యాంగ విద్యార్థులు విద్యను అభ్య సించడానికి అనుకూలమైన క్లాస్ రూమ్స్,వాష్ రూమ్స్,ర్యాంప్ రైలింగ్‌లు,స్టడీ మెటీరియల్,తదితర అంశాలు కమిషనర్‌కు తెలియజేశారు.ఫెడ్ చైర్మన్ గంగారం,ప్రధాన కార్యదర్శి చేరుకు నాగభూషణంలు తెలిపారు.ఈ సదర్భంగా కమిషనర్ నరసింహా రెడ్డి పార్క్‌లోని బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు.ఈ సమావేశంలో మలక్‌పేట్ యూసిడి ప్రాజెక్టు ఆఫీసర్ యుగంధర్ రెడ్డి,సభ్యులు నర్సింగ రావు,వెంకట రెడ్డి, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి

**మలక్‌పేట నవంబరు1,ప్రభాతవార్త :** మాజీ ప్రదాని ఇందిరా గాంధీ వర్థంతిని పురస్కరించుకొని గ్రేటర్ కాంగ్రెస్ ఓబిసి సెల్ వైస్ చైర్మన్ చౌకి రవి కుమార్,గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాసులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశం కోసం తమ ప్రాణాలను సైతం బలి ఇచ్చారని పేర్కొన్నారు.పేద బడుగు,బలహీన వర్గాల సంక్షే మ కోసం ఆమె ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.దేశానికి ఆమె చేసిన సేవలు ఎల్లప్పుడూ చిరస్మరణీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏబ్లాక్ కార్యదరిశ రామకృష్ణ,నాయకులు రాజు, నరేందర్,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రోహిత్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**మల్కాజిగిరి నవంబరు1,ప్రభాతవార్త :** మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ బాబు జన్మదినం పురస్కరించుకొని రాత్రి ఆనంద్ బాబు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్మ దిన సంబరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి టపాకాయలు పేల్చి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్,బి బ్లాక్ వెంకటేష్ యాదవ్,జీఎన్ వి సతీష్ కుమార్,పిట్టల శ్రీనివాస్ గుండ,నిరంజన్ ఎస్‌ఆర్ ప్రసాద్,సంపత్ గౌడ్,వినోద్ యాదవ్,వైనాల ప్రవీణ్,కొండ గౌడ్, సంతోష్ రాందాస్,నాగరాజు,సురేష్ సింగ్,బాబు ,సత్య నారా యణ,రాంచందర్,సయ్యద్ మబ్బు,ఫరీద్, సహీంఖాన్,యాదగిరి ,కిషోర్ ,సంగీత,చంద్రకళ,నిర్మల ,లాస్య,లక్ష్మి,మహాలక్ష్మి,సిరిగిరి రాజు,శ్రీరామ్,చెన్నారెడ్డి,పరమేష్,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి



**మల్కాజిగిరి నవంబరు1,ప్రభాతవార్త :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా మైనంపల్లి హనుమంత రావు ఆదేశా ల మేరకు మల్కాజిగిరి చౌరస్తాలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వై.ప్రేమ్ కుమార్, బిబ్లాక్ వెంకటేష్ యాదవ్,జి.ఎన్.వి సతీష్ కుమార్,ఎస్.ఆర్ ప్రసాద్,సంపత్ గౌడ్,వినోద్ యాదవ్,వైనాల ప్రవీణ్ కొండ గౌడ్, సంతోష్ రాందాస్,నాగరాజు,సురేష్ సింగ్,బాబు,సత్యనారాయణ ,రాంచందట్,ఫరిద్,నహీంఖాన్,యాదగిరి ,కిషోర్, సంగీత, చంద్రకళ,నిర్మల ,లాస్య,లక్ష్మి,మహాలక్ష్మి,సిరిగిరి రాజు,శ్రీరామ్, పరమేష్,తదితరులు పాల్గొన్నారు.

## కాల బైరవ ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు

**ఉప్పల్, నవంబరు 1 ప్రభాతవార్త :**
ఉప్పల్ భగాయత్‌లోని శ్రీ కాల బైరవ ఆలయంలో అమావాస్య సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ప్రతి నెలా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆలయంలో భక్తులకు తగు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు వినోద్‌రెడ్డి, బొట్టు వెంకట్, కమ్మ లక్ష్మణ్, బొంగు రమేష్ గౌడ్, బిఆర్‌ఎస్ నేతలు ఆకుల మహేందర్, జెట్ట కిషోర్, నిరంజ న్‌చారి, బజారు రామరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మూసి నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తున్న ప్రభుత్వం : శ్రీనివాస్

**మలక్‌పేట నవంబరు1,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మూసి నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయి స్తోందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చేకోలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూసి నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించడంతో ముసారాంబాగ్ డివిజన్,శాలివాహన నగర్ సాయిలు హట్స్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మూసి నిర్వా సితులతో కలిసి ఆయన చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అదేవిధంగా మూసి ప్రక్షాళనను అడ్డుకోవద్దని పేర్కొంటూ మూసి నిర్వాసితులతో కలిసి బిఆర్ఎస్,బిజెపి నాయకుల చిత్రపటాలను ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన చేపట్టా రు.కెసిఆర్.కెటిఆర్ ,ఈటల రాజేందర్‌లు ఈ ప్రాంతంలో నివాసం ఉండేందుకు వీలుగా మంచాలు,కుర్చీలు ,మంచి నీరు తదితర సదుపాయాలను ఏర్పాటు చేసి పలువురు మహిళలు పూలతో స్వాగతం పలుకుతూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చెకోలేకార్ శ్రీనివాస్ మాట్లాడు తూ...మాజీ సిఎం కెసిఆర్,మాజీ మంత్రి కెటిఆర్,బిజెపి నాయకులు ఈటల రాజేందర్‌లు ఈ ప్రాంతంలో ఒక్క రోజై నా నివాసం ఉండాలని,దింతో స్థానిక ప్రజల సమస్యలు



ముసి నిర్వాసితులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేకోలేకార్ శ్రీనివాస్,తదితరులు

అర్థం అవుతాయని పేర్కొన్నారు.ముసి పరివాహక ప్రాంతం లో గతంలో పలుమార్లు రేవంత్ రెడ్డి పర్యటించడం జరిగిం దని ప్రజల బాధలు ఆయనకు తెలుసునని పేర్కొ న్నారు.గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేస్తుందని తెలిపారు.మూసి నిర్వాసితులు స్వచ్ఛందంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి తరలివెళ్త న్నారని తెలిపారు.కార్యక్రమంలో పలువురు మూసి నిర్వాసి తులు,నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో ఘనంగా సదర్ సమ్మేళనం

**ఉప్పల్, నవంబరు 1 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రామంతాపూర్ యాదవ సంఘం, బిజెపి సీనియర్ నేత వల్లపు జగన్ యాదవ్, శ్రీకాంత్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, బొంతు శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల.పరమేశ్వర్‌రెడ్డిలు ముఖ్య అతిధులుగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యాదవ సోదరులు ఎంతో వైభవంగా చేసుకునే సదర్ సమ్మేళనంలో ప్రతి ఒక్కరు ఆనందోత్స వాలతో పాల్గొనడం అభినందనీయమన్నారు. యాదవులు ప్రతి ఏటా ఉత్సహంగా సదర్ వేడుకలు చేసుకోవడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన దున్న రాజుల నృత్యాలు, యువకుల కేరింతలో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు గడ్డం సాయికిరణ్, రేవు



రామంతాపూర్‌లో సదర్ సమ్మేళనంలో పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్ తదితరులు

నరసింహా, వేముల వెంకట్‌రెడ్డి, బిఆర్‌ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు, బుర్ర మహేందర్, యాదవ సంఘం నేతలు వల్లపు మల్లేష్‌యాదవ్, సర్వ బాబుయాదవ్, రాజు యాద వ్, సత్యయ్యయాదవ్, సర్వ నరసింహా, సర్వ రవీందర్, సర్వ ఆనంద్, రఘు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# దోబిఘాట్ సమస్యపై ఎంఆర్ఓతో ఎమ్మెల్యే సమావేశం

**మల్కాజిగిరి నవంబరు1,ప్రభాతవార్త :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని జ్యోతినగర్ 856 సర్వే నెంబర్‌లో గల దోభీ ఘాట్ సమస్యపై స్థానిక ఎమ్మార్ఓ సీతారంని రాజకుల తో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమావేశమై య్యారు.1985 నుండి 2021వ సంవత్సరం వరకు రజకు లు తమ కులవృత్తిని జ్యోతినగర్ ధోభిఘాట్‌లో కొనసాగిం చారు.అయితే శిథిలావస్థకు చేరిన ధోబిఘాట్‌ను అన్ని సౌక ర్యాలతో పునర్ నిర్మిస్తామని బల్దియా అధికారులు దోబి ఘాట్‌ను కూల్చివేశారు.చుట్టు ప్రహరీ గోడ నిర్మించిన తర్వాత స్థానిక కాలనీ వాసులు ఒకరిద్దరు అడ్డంకులు సృష్టించడంతో దోభిఘాట్ పనులు నిలిచిపోయినాయి. అప్పటి నుండి రజకులకు కుల వృత్తి చేసుకోవడం ఇబ్బంది కరంగా మారింది.అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు.గతంలో రజకులు ఎమ్మెల్యేకి ఈ విషయంపై కలవగా,ఎమ్మెల్యే అధికారుల దృష్టికి సమ స్యను తీసుకెళ్లడం జరిగింది.అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఏకంగా రాజకులందరిని వెంట తీసుకొని స్థానిక ఎమ్మా



ర్వోను తన కార్యాలయంలో కలిశారు.ఈ సమస్యను ఒక్క వారం రోజుల లోపు ఒక్క కొలిక్కి తీసుకురాకపోతే తహసీ ల్దార్ కార్యాలయం ఎదుట తానే స్వయంగా ధర్నాకు కూ ర్చుంటానని హెచ్చరించారు.దశాబ్దాలుగా అక్కడే జీవనం సాగిస్తున్న రాజకులకు అన్యాయం చేయాలని కొంతమంది స్వార్థపరులు చూస్తున్నారని అధికారులు రాజకీయాలకు తలొగ్గితే సమాజంలో సామాన్యుడి బ్రతుకు ప్రశ్నార్థకం అవుతుందని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు.

## శ్రీ గాయత్రి నగర్ నూతన కమిటీ ఏకగ్రీవం



శ్రీ గాయత్రి నగర్ నూతన కమిటీ ప్రతినిధులు

**వనస్థలిపురం నవంబరు1,ప్రభాతవార్త :** బిఎన్ రెడ్డి డివిజన్‌లోని శ్రీ గాయత్రి నగర్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకయింది.నూతన కమిటీ అధ్యక్షుడిగా నేనావత్ సూర నాయక్,ఉపాధ్యక్షుడిగా వేమిరెడ్డి నర్సింహా రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా చైతన్య రెడ్డి,జాయింట్ సెక్రటరీగా గంగాధర్ ,కోశాధికారిగా శేషఫణి భరద్వాజ్,న్యాయ సలహాదారుగా చక్రాల రామచందర్,సలహాదారులుగా కేమి జగదీష్ ,అన్న వరపు ప్రసాద్,చెన్న బసవయ్య,కర్రి శివరామకృష్ణ ,కొర్ర రాములు నాయక్,ఈసి మెంబర్‌లుగా ఇస్లావత్ జగదీష్ నాయక్,కేతవత్ శ్రీకాంత్,నాగేందర్,మైలరరపు నవీన్ కుమార్,బత్తిని రమేష్‌లను కాలనీ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్య క్షుడు సూర్య నాయక్ మాట్లాడుతూ...కాలనీలో నెలకన్న సమస్యలను ప్రజాప్రతినిధులు,అధికారుల దృష్టికి తీసుకెళ్లి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.కాలనీవాసులకు అం దుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా కాలనీ సభ్యులు నూతక కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

## టిటిడి బోర్డు సభ్యుడు నర్సిరెడ్డికి సత్కారం

**ఉప్పల్, నవంబరు 1 ప్రభాతవార్త :** టిటిడి బోర్డు సభ్యుని గా ఎన్నికైన నన్నూరి నర్సిరెడ్డిని శుక్రవారం యువ కాపు నాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ సర్కిల్ కాంగ్రెస్ సీనియ ర్ నేత గడ్డం రవికుమార్ కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ నర్సిరెడ్డి సేవలు తిరుమల తిరుపతి దేవస్థానానికి ఉప యోగపడడం ఎంతో అభినందనీయమన్నారు. టిటిడి అభి వృద్దికి కృషి చేయాలని కోరారు. టిటిడి సభ్యుడు ఎన్. నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు తన వంతు సహకారం అందిస్తానని, దేవుడిని సేవ చేసే భాగ్యం కల్పించిన టిడిపి అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబును సత్కరించిన పరమేశ్వర్‌రెడ్డి



మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలను సత్కరిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 1 ప్రభాతవార్త :** ఉప్పల్ శివారులో అభి వృద్ధి పనుల ప్రారంభోత్స వానికి వెళుతున్న రాష్ట్ర ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును శుక్రవారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దీపావళి సందర్భంగా మంత్రి డి.శ్రీధర్ బాబును కలిసి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నా రు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రె స్ పార్టీ నేతలు తుమ్మల దేవిరెడ్డి, పాలడుగు లక్ష్మణ్, రాజేందర్‌రెడ్డి, హనుమంతు, పీరంబీ, నాగూర్‌బాషా, సురే ష్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే



**తుర్కయంజాల్ నవంబరు1,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మొత్తం తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటి సామాజిక విద్యా ఆర్థిక ఉపాధి రాజకీయ కుల సర్వే చేపట్టాలని నిర్ణయిం చడమైనది.ఇందులో భాగంగా శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో సర్వే నిర్వహించారు.ఈ సందర్భం గా తుర్కయంజాల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి మాట్లాడు తూ....సిఎం రేవంత్‌రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టీ విక్రమా ర్క ఆదేశాల ప్రకారం...తుర్కయంజాల్‌లలో ఇంటింటి సర్వేపై సూచనలు ,సలహాలు చేశారు.ఈ సమగ్ర సర్వే విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య,ఇంద్రమ్మ,కాలని అధ్య క్షుడు వేముల శంకర్,మున్సిపాలిటీ సిబ్బంది ప్రశాంత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## జల్‌పల్లి కొత్త కమిషనర్‌కు సన్మానం

**సరూర్‌నగర్, నవంబర్ 1 ప్రభాతవార్త:** మహేశ్వరం నియో జకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ కమీషనర్‌గా బాధ్యత లు చేపట్టిన వెంకట్రాంను మున్సిపాలిటీకి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బిఆర్‌ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి వాసుబాబు, జల్‌పల్లి మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు యాంజాల అర్జున్‌తో పాటు పలువురు కొత్త కమీషనర్‌ను సన్మానించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడు తూ జల్‌పల్లి అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. మున్సి పాలిటీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు కమిషనర్‌ను కోరారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుతో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బేటి



మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 1 ప్రభాతవార్త :**
మాజీ మంత్రి హరీష్‌రావును శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బేటి అయ్యారు. దీపావళి పండుగ సందర్భంగా హరీష్ రావును కలిసి శాలువాతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి హరీష్‌రావు చేసిన సేవలు అభినందనీయ మన్నారు. హరీష్‌రావు నాయకత్వంలో బిఆర్‌ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఏఐటియూసి 105వ ఆవిర్భావ దినోత్సవం



**తుర్కయంజాల్ నవంబరు1,ప్రభాతవార్త :** తుర్కయం జాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో కార్మికులు ఘనంగా ఏఐటియూసి 105వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఏఐటియూ సి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య మాట్లాడు తూ...కార్మికుల హక్కులను కాపాడటానికి కార్మికుల జీవితాల్లో వెలుగు నింపటానికి 1920 అక్టోబరు 31న ఏఐటియూసి ఆవిర్భవించిందని అన్నారు.కార్మికుల హక్కుల కోసం ఏఐటియూసి నిరంతరం పోరాటం సాగి స్తూనే ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ కుమార్,సుందరమ్మ, కృష్ణ య్య,గురువయ్య,కొండల్,నీలా ,కొట్యా నాయక్, యాద య్య,తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా బిబిఆర్ వేణు



వేణుకు నియామక పత్రం అందజేస్తున్న జగన్‌గౌడ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా, మీడి యా ఇనీన్చార్జిగా బిబిఆర్ వేణు నియామకమయ్యారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్‌గౌడ్ శుక్రవారం వేణుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడు బొక్క నరసింహరెడ్డి, ఆర్కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి, గీత సెల్ కోకన్వీనర్ రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్‌ల సలహాలు సూచ నలతో ముందుకు వెళ్తామన్నారు. పార్టీ పిలుపు ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. కేం ద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రజా సంక్షేమ పథకా లను అర్హులైన ప్రజలకు అందే విధంగా కృషి చేస్తామ న్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రపంచ దేశా లు హర్షిస్తున్నాయని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం : పున్న



భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న పున్న నిర్మల గణేష్ నేత దంపతులు, మహమ్మద్

**ఎల్.బి.నగర్, నవంబర్ 1 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మల గణేష్‌నేత, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌నేత, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం రంగారెడ్డి జిల్లా నా యకుడు ఎస్కే.మహమ్మద్ పేర్కొన్నారు. టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిని శుక్రవారం వారు శాలువా తో సత్కరించి పుష్పకత్వాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్ర మంలో పిట్ట హరినాథ్‌రెడ్డి, ఖిల్లామైసమ్మ చైర్మన్ సురేష్‌కుమార్, గట్ల రవీంద్ర, దుర్గా ప్రసాద్, జిన్నం వేంకటేశ్వర్లు, జెల్ల జగన్నాథం, బోడ్డుపల్లి మహేందర్, యల్లన్న, సంపత్ శ్రీకాంత్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌గౌడ్, పొట్టబతిని నగేష్, దొర్నాల చంద్రమౌళి, సంతోష్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో ఘనంగా సదరు ఉత్సవం



పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 1 ప్రభాతవార్త:**
కొత్తపేట గ్రామంలో సదర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదర్ ఉత్సవంలో పరిసర ప్రాంతాలకు చెందిన దున్నపోతులను తీసుకువచ్చి విన్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమానికి కొత్త డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్, కొత్తపేట డివిజన్ టిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, చైతన్యపురి డివిజన్ టిఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్ మాజీ కౌన్సిలర్ వెంకటేష్ యాదవ్ హాజరుకాగా నిర్వాహకులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తోట కృష్ణ యాదవ్, తోట శ్రీనివాస్ యాదవ్, మహేం దర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలకు ఎంపికైన లార్డ్స్ విద్యార్థినికి అభినందనలు



క్రికెట్ పోటీలకు ఎంపికైన ఆశ్రితను అభినందించిన బీరప్ప, శ్రీనివాస్‌రెడ్డిలు

**సరూర్‌నగర్, నవంబర్ 1 ప్రభాతవార్త:** కర్ణాటకలోని శివామొగ్గలో ఈ నెల 21 నుండి 29వ తేదీ వరకు జరిగే అండర్ 15 బాలికల క్రికెట్ పోటీలకు హైదరాబా ద్ క్రికెట్ జట్టు తరపున పాల్గొనడానికి బడంగ్‌పేట్ లార్డ్స్ పాఠశాలకు చెందిన ఆశ్రిత ఎంపికైంది. ఈ సంద ర్భంగా లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డిలు ప్రతిష్టాత్మక బిసిసిఐ నిర్వహించే పోటీలకు తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణమని అన్నారు. ఈ మేరకు వారు ఆశ్రితను అభినందించి క్రికెట్ పోటీల్లో రాణించాలని ఆ కాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సతీష్, ప్రిన్సిపాల్ మరియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెద్దఅంబర్‌పేటలో వైభవంగా సదర్ ఉత్సవం



సదర్ ఉత్సవంలో ఈటెల రాజేందర్, నాయకులు

**హయత్‌నగర్, నవంబరు 1 ప్రభాతవార్త:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేటలో గురువారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దఅంబర్‌పేట శ్రీకృష్ణ యాదవ యుజవన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మానికి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... సదర్ ఉత్సవాలు యాదవుల సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. సదర్ ఉత్సవాలలో దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్, బీజేపీ మహేశ్వరం ఇంఛార్జ్ శ్రీరా ములు యాదవ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామమల్లేష్, బీజేపీ ఇబ్రహీంపట్నం నాయకులు కొత్తఅశోక్‌గౌడ్, బీజేపీ పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ యాదవ్, పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు, కౌన్సిలర్ సిద్ధంకి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సంస్కృతికి ప్రతీక సదర్ సమ్మేళనం : పరమేశ్వర్‌రెడ్డి



రామంతాపూర్‌లో సదర్ సమ్మేళనంలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 1 ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతికి సదర్ సమ్మేళనం ప్రతీకగా నిలుస్తుందని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పాత రామంతాపూర్‌లో యాదవ సంఘం, కాంగ్రెస్ నేత వల్లపు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సదర్ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ యాదవులు ప్రతి ఏటా సదర్ ఉత్స వాలు ఆనందోత్సవాలు చేసుకోవడం అభినందనీయమన్నారు. యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని, వారికి ప్రభుత్వం నుంచి తగు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈసంద ర్భంగా దున్నరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తౌపి క్, నామ్ రాజిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, జలీల్‌పాషా, గరిక సుధాకర్, సందీప్, శాగ శ్రీధర్, మంద మురళీ, భాస్కర్, పూర్ణ యాదవ్, రాకేష్‌యాదవ్, బుల్లెట్ అశోక్, అరుణ్‌సాయి, జంగయ్య, మధు, నాగ మల్లయ్య, యాదగిరిరెడ్డి, పెంటయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌వివిలో ఘనంగా దీపావళి సంబరాలు



వివిధ వేషధారణల్లోని చిన్నారులతో ఎస్‌వివి కరస్పాండెంట్ వీరేందర్‌బాబు

**సైదాబాద్, నవంబరు 1 ప్రభాతవార్త:** సైదాబాద్‌లోని శ్రీ విజ్ఞాన వర్ధిని హై స్కూల్‌లో దసరా, దీపావళి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్యార్థినులతో పాటు స్థానిక మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థినులు అందమైన రంగవల్లులను తీర్చిదిద్ది వాటి మధ్య దీపాలను వెలిగించడంతో పాఠశాల మొత్తం పండుగ వాతావర ణం నెలకొంది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వీరేందర్‌బాబు మాట్లాడుతూ దీపావళి పండుగనాడు బాణసంచా కాల్చేటప్పుడు విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యాభై సంవత్స రాలు పూర్తి చేసుకుంటున్న తమ పాఠశాలలో చదువుతో పాటు విద్యార్థులకు ఆటలు, సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సినీనిటి పూజిత, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మధుయాష్కీని విమర్శించే నైతిక హక్కు సుధీర్‌రెడ్డికి లేదు : కందికంటి శ్రీధరగౌడ్

**సైదాబాద్, నవంబరు 1 ప్రభాతవార్త:** విలువలతో కూడిన రాజకీ యం చేసే మధుయాష్కీని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి లేదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ జిఓ 118ను కేవలం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేవలం ఎన్నికల కోసం తీసుకువచ్చారని, అది పూర్తిగా తప్పుల తడకగా ఉందన్నారు. ఎవరు అక్రమంగా సంపాదించారో ప్రజలకు తెలుసని, 2004లో మొదటిసారి ఎంపిగా గెలిచిన తర్వాత మధుయాష్కీ ఆస్తులు, 2005లో హుడా చైర్మన్‌గా, ఆ తర్వాత ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సుధీర్‌రెడ్డి ఆస్తులు ఎంతో లెక్క తీద్దామా అని ఆయన ప్రశ్నించారు. మధుయాష్కీపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. జిఓ 118లోని సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిష్కరి స్తారని, ఎవరు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

## బడంగ్‌పేట్ రోమా ఎన్‌క్లేవ్‌లో కమిషనర్ పర్యటన



బడంగ్‌పేట్ రోమా కాలనీలో పర్యటించిన కమిషనర్ సరస్వతి: చిత్రంలో కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి, సర్వే ఎన్యూమరేటర్లు ఉన్నారు

**సరూర్‌నగర్, నవంబర్ 1 ప్రభాతవార్త:**
ఈ నెల 6వ తేదీ నుండి చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వే నేపథ్యంలో శుక్ర వారం బడంగ్‌పేట్ మున్సిపల్ కారొ ్పరేషన్‌లో కమీషనర్ సరస్వతి పర్యటించారు. ఇందులో భాగంగా ఆమె కార్పొరేషన్ లోని 30వ డివిజన్ రోమా ఎన్‌క్లేవ్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి, సర్వే చేసే ఎన్యూమరేటర్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు ఇళ్ళకు తిరిగి ఎన్యూమరేటర్లకు సర్వే విషయంలో దిశా నిర్దేశనం చేశారు. అయితే సర్వే చేయనున్న సిబ్బంది ఇళ్ళకు స్టిక్కర్లను అతికించా రు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిఇఇ నర్సింహరాజు, ఎన్యూ మరేటర్లు పాల్గొన్నారు.